దివ్యాంగులకు సదరమ్ పరీక్షలు

నిర్మల్ చైన్‌గేట్, ఆగస్టు 13 : నిర్మల్ ప్రభుత్వ దవాఖానలో మంగళవారం దివ్యాంగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సదరమ్ ధ్రువీకరణ పత్రాల కోసం 70 మంది వరకు దరఖాస్తు చేసుకున్నారు. మంగళవారం వైద్యాధికారులు రవి, సృజన్‌లు పరీక్షలు చేశారు. గంటల తరబడి వేచి ఉన్నారు. శిబిరం వద్ద దివ్యాంగులు కూర్చోవడానికి వసతులు ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. అధికారులు శిబిరాల వద్ద దివ్యాంగుల కొరకు వసతులు కల్పించాలని కోరారు.

నిర్మల్ ప్రభుత్వ దవాఖానలో పరీక్షల కోసం వేచి ఉన్న దివ్యాంగులు

మహిళలపై వివక్షత కొనసాగుతోంది

పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగ

ఎదులాపురం, ఆగస్టు 13 : రాష్ట్రంలో మహిళలపై వివక్షత కొనసాగుతున్నదని, పనిచేసే చోట్ల లైంగిక వేధింపులకు గురవుతున్నారని పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందే మంగ అన్నారు. మంగళవారం ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) ఆదిలాబాద్ జిల్లా ఏడో మహాసభ జిల్లా కేంద్రంలోని యాదవ సంఘం భవనంలో 100 మంది మహిళలతో నిర్వహించారు. ముందుగా జిల్లా కన్వీనర్ దుర్గం కళావతి పీవోడబ్ల్యూ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మహిళా అమరవీరులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ అందే మంగ మాట్లాడుతూ.. దేశం, రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, వరకట్న హత్యలు, లైంగిక వేధింపులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం వచ్చాక మహిళలపై హింస, మతోన్మాదం పెరిగిపోతున్నదని పేర్కొన్నారు. మహిళ మల్లయోధులపై బీజేపీ ఎంపీ బ్రిజ్జిభూషణ్ వేధింపులకు పాల్పడ్డారని లైంగిక వేధింపుల చట్టం ఉన్నప్పటికీ అతనిపై ఎలాంటి కేసు నమోదు చేయలేదని ఆవేదన చెందారు. పీవోడబ్ల్యూ జిల్లా నాయకురాలు గంగమ్మ, తారాబాయి, సుజాత, దీప, లక్ష్మి పాల్గొన్నారు.

జెండాను ఆవిష్కరిస్తున్న పీవోడబ్ల్యూవో జిల్లా కన్వీనర్ దుర్గం కళావతి

ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం

ఇచ్చోడ, ఆగస్టు 13 : ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రధానమంత్రి మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకుడు రాజేశ్వర్ మాట్లాడుతూ.. రాజ్యాంగంలో ఉన్న 341 ఆర్టికల్‌ను సవరించకుండా అన్నదమ్ముల లాగా కలిసి ఉన్న ఎస్సీలను విడదీసి కులాల మధ్య చిచ్చును రేపుతున్నారన్నారు. ఇది రాజ్యాంగ విరుద్ధమని, దీన్ని తాము ఖండిస్తున్నామన్నారు. త్వరలోనే వర్గీకరణ వ్యతిరేక పోరాట ప్రణాళిక ప్రకటిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొప్పుల శంకర్, అంగర్ల నాగన్న, సల్లం రమేశ్, కటకం వెంకటేశ్, రాజు, గంగయ్య పాల్గొన్నారు.

మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కమిటీ సభ్యులు

స్వాతంత్ర్య వేడుకల ఏర్పాట్లను పూర్తి చేయాలి

నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

సోన్, ఆగస్టు 13 : స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం నిర్మల్ పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 78వ స్వాతంత్ర్య దినోత్సవ ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లను చేయాలని సూచించారు. దేశభక్తి ఉట్టిపడేలా విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రతిబింబించేలా వివిధ శాఖల ఆధ్వర్యంలో స్టాళ్లు, శకటాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్వాతంత్ర్య సమరయోధులు, ప్రజాప్రతినిధులు, అధికారులకు, జర్నలిస్టులు, విద్యార్థులు, ప్రజలకు ప్రోటోకాల్ ప్రకారం సీటింగ్‌ను ఏర్పాటు చేయాలని తెలిపారు. వేడుకలకు హాజరయ్యే ప్రజలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వికలాంగులు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా తాగునీరు, టెంటు, కూర్చీల వంటి ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బంద్ ప్రశాంతం

ఎదులాపురం, ఆగస్టు 13 : బంగ్లాదేశ్‌లో హిందువులు, ఆలయాలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ చాంబర్ అఫ్ కామర్స్ పిలుపు మేరకు ఆదిలాబాద్ పట్టణ బంద్ ప్రశాంతంగా ముగిసింది. వ్యాపారులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి దుకాణాలను మూసి ఉంచారు. హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా వ్యాపారస్తులు బంద్‌లో పాల్గొని సంఘీభావం తెలిపారు. బంద్ నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు చేపట్టారు.

జ్వరం పంజా

● అల్లాడుతున్న జనం ● వైరల్, డెంగ్యూ, టైఫాయిడ్‌తో సతమతం ● రిమ్స్‌లో 2,361 మంది ఓపీ నమోదు

రిమ్స్ దవాఖానలో ఓపీ కౌంటర్ వద్ద టోకెన్ కోసం క్యూలైన్

చికిత్స పొందుతున్న రోగులు

ఆదిలాబాద్, ఆగస్టు 13(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా జ్వరాలు పంజా విసురుతున్నాయి. సీజనల్ వ్యాధుల ప్రభావంతో జనం అల్లాడుతున్నారు. వైరల్ ఫీవర్స్‌తోపాటు డెంగ్యూ, టైఫాయిడ్‌తో ప్రజలు సతమతం అవుతున్నారు. జ్వరాలబారిన పడి వైద్యం కోసం వచ్చే వారితో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. గ్రామాల్లో అపరిశుభ్ర వాతావరణం, దోమలు, కలుషితమైన నీరు జ్వరాలు ప్రబలడానికి కారణమవుతున్నాయి. ఏజెన్సీ గ్రామాల్లో వ్యాధులు ప్రభావం ఎక్కువగా ఉంది. జ్వరాలతో గిరిజన గ్రామాల ప్రజలు చికిత్సల కోసం ఉట్నూర్, ఆదిలాబాద్ ఆసుపత్రుల్లో చేరుతున్నారు. 'నమస్తే తెలంగాణ' మంగళవారం ప్రభుత్వ దవాఖానలను విజిట్ చేసింది.

రిమ్స్‌లో 2,361 ఓపీ

ఆదిలాబాద్ జిల్లాలోని వివిధ రకాల వ్యాధులతో బాధపడుతూ చికిత్స కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు వచ్చే వారి సంఖ్య పది రోజులుగా పెరిగింది. సోమవారం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిలో 2,361 ఓపీ, 775 ఐపీ నమోదు అయినట్లు డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తెలిపారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వ్యాధులకు చికిత్సలు అందించడానికి 60 బెడ్స్‌తో కూడిన మూడు ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్స్‌లో వైద్యం కోసం వచ్చే వారి సంఖ్య బాగా పెరిగింది. రోగులతో ప్రైవేటు ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. వివిధ గ్రామాల ప్రజలు జ్వరాలతో ఆసుపత్రుల్లో చేరుతుండడంతో వారి కుటుంబ సభ్యులు ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సి వస్తున్నది.

మెరుగైన వైద్యం అందిస్తున్నాం..

వివిధ వ్యాధులతో బాధపడుతూ చికిత్స కోసం వచ్చే వారి సంఖ్య కొన్ని రోజులుగా బాగా పెరిగింది. వైరల్ ఫీవర్స్‌తోపాటు డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా లాంటి వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చికిత్స కోసం వచ్చే రోగులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అవసరమైన చర్యలు తీసుకున్నాం. మూడు ప్రత్యేక వార్డులను ఏర్పాటు చేసి బెడ్‌ల సంఖ్యను పెంచాం. ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌లతో టీఎంలు ఏర్పాటు చేసి 24 గంటలు చికిత్సలు అందిస్తున్నాం. వివిధ రకాల పరీక్షలు నిర్వహించడంతోపాటు మందుల కొరత లేకుండా చూస్తున్నాం.

- జైసింగ్ రాథోడ్, డైరెక్టర్, రిమ్స్

నమస్తే విజిట్ NAMASTE VISIT

నిర్మల్‌లోని ప్రభుత్వ ప్రసూతి దవఖానలో చికిత్సల కోసం పెద్ద సంఖ్యలో వచ్చిన ప్రజలు

ఖానాపూర్ దవాఖానలో ఇటీవల ఒకే బెడ్‌పై ఇద్దరు రోగులను ఉంచి చికిత్స

రోగులు ఫుల్.. సేవలు నిల్

● సర్కారు దవాఖానల్లో వైద్యుల కొరత ● పేదలకు అందని వైద్య సేవలు ● జిల్లా ఆసుపత్రిలో 95 పోస్టులు ఖాళీ
● ప్రసూతి దవాఖానలో గైనకాలజిస్టుల కొరత ● పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

నిర్మల్, ఆగస్టు 13(నమస్తే తెలంగాణ) : ఏడు నెలల నుంచి ఖాళీ అయిన వైద్యుల పోస్టుల భర్తీపై ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు దృష్టి సారించకపోవడం పేదలకు శాపంగా మారుతున్నది. నిర్మల్ జిల్లావ్యాప్తంగా ప్రస్తుతం సీజనల్ వ్యాధులు విజృంభిస్తుండడంతో ప్రభుత్వ ఆసుపత్రులన్నీ రోగులతో కిటకిటలాడుతున్నాయి. జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రితోపాటు ప్రసూతి ఆసుపత్రి, భైంసా, ఖానాపూర్ పట్టణాల్లోని ఏరియా ఆసుపత్రులకు ప్రతిరోజు వందల సంఖ్యలో బాధితులు వైద్య చికిత్సల కోసం బారులు దీరుతున్నారు. ముఖ్యంగా డెంగీ, టైఫాయిడ్, విష జ్వరాలతో అనేక మంది బాధపడుతున్నారు. అయితే వైద్యుల కొరత కారణంగా ఆయా ఆసుపత్రుల్లో రోగులకు పూర్తి స్థాయిలో చికిత్సలు అందడం లేదు.

- భైంసా ఏరియా ఆసుపత్రిలో మొత్తం 29 మంది వైద్యులకు ప్రస్తుతం 20 మంది మాత్రమే చికిత్స అందిస్తున్నట్లు తెలిసింది. మిగతా వారిలో కొందరు డిప్యూటేషన్‌పై ఇతర ప్రాంతాలకు వెళ్లగా, మరి కొందరు వైద్యులు సెలవులో ఉన్నట్లు చెబుతున్నారు. అయితే ఇక్కడి ఆసుపత్రికి రోజు భైంసా పట్టణంతోపాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి వైద్య పరీక్షల కోసం 600 నుంచి 700 మంది రోగులు వస్తుంటారు. రోగుల సంఖ్యకు అనుగుణంగా వైద్యులు అందుబాటులో లేకపోవడంతో బాదితులకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందడం లేదంటున్నారు.
- జిల్లా కేంద్రమైన నిర్మల్‌లో ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రధాన ఆసుపత్రితోపాటు ప్రసూతి ఆసుపత్రిలో రోగులకు వైద్య సేవలు అందుతున్నాయి. ఆయా ఆసుపత్రుల్లో గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే రోగులకు అవసరమైన అన్ని రకాల సదుపాయాలను కల్పించారు. అత్యాధునిక సదుపాయాలు అందుబాటులోకి రావడంతో పదేళ్లలో అన్ని వర్గాల ప్రజలకు ఇక్కడి ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేటు స్థాయి వైద్యం ఉచితంగా అందింది. ఇక్కడి ప్రధాన ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన టీ-డయాగ్నోస్టిక్ హబ్, డయాలసిస్ సెంటర్, పాలియేటివ్ కేర్ సెంటర్‌లతోపాటు వెంటిలేటర్ సదుపాయంతో కూడిన ఐసీయూ, సీటీ స్కాన్ సదుపాయాలు రోగులకు అందుతున్నప్పటికీ, డాక్టర్ల కొరత వేధిస్తున్నదని చెబుతున్నారు. ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రికి చికిత్సల కోసం ప్రతిరోజు 300-400 మంది మహిళలు వివిధ ఆరోగ్య సమస్యలతో వస్తుంటారు. ఇక్కడ ఉండాల్సిన 12 మంది స్త్రీ వైద్య నిపుణులకు కేవలం నలుగురు డాక్టర్లు మాత్రమే అందుబాటులో ఉన్నారు. దీంతో ఇక్కడ అరకొర వైద్యం మాత్రమే అందుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. అలాగే జిల్లా ప్రధాన ఆసుపత్రికి సైతం ప్రతిరోజు 1200-1300 మంది రోగులు చికిత్సల కోసం వస్తుంటారు. మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఉన్న ఇక్కడి ఆసుపత్రిలో మొత్తం165 మంది డాక్టర్లకు కేవలం 70 మంది మాత్రమే ఉన్నారు. ఏకంగా ఇక్కడి ఆసుపత్రిలో 95 డాక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో రోజు ఇక్కడికి పెద్ద సంఖ్యలో వచ్చే రోగులకు తూతూ మంత్రంగానే వైద్య సేవలు అందుతున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి.
- ఖానాపూర్ పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో అడుగడుగునా సమస్యలే దర్శనమిస్తున్నాయి. ఇక్కడి ఆసుపత్రిలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందంటున్నారు. రోగులకు సరిపడా బెడ్లు కూడా అందుబాటులో లేకపోవడంతో ఒకే బెడ్‌పై ఇద్దరు రోగులను ఉంచి చికిత్సలు అందిస్తున్నారు. ఎక్స్ రే, సీబీపీ పరికరాలు పని చేయకపోవడంతో రోగులు ప్రైవేటులో డబ్బులు ఖర్చు చేసి పరీక్షలు చేయించుకుంటున్నారని సమాచారం. టీబీ, హెచ్ ఐవీ పరీక్షల కోసం శాంపిళ్లను సేకరించి నిర్మల్‌లోని టీ-హబ్‌కు పంపడం వల్ల ఫలితాలు ఆలస్యమై చికిత్సలు అందడంలో జాప్యం జరుగుతున్నదని రోగులు వాపోతున్నారు. ప్రతిరోజు వందలాది మంది బాధితులు సీజనల్ వ్యాధులతో బాధపడుతూ చికిత్సల కోసం ఇక్కడి ఆసుపత్రికి వస్తుండగా, సరైన సదుపాయాలు లేని కారణంగా పూర్తి స్థాయిలో వైద్యం అందడం లేదంటున్నారు. ఇటీవలే ఇక్కడి ఆసుపత్రిలో కాలం చెల్లిన సెలైన్ బాటిల్‌ను రోగికి ఎక్కించిన ఘటన సంచలనంగా మారిన సంగతి తెలిసిందే.

ధన్నుగూడ ఒర్రెదాటుతున్న వైద్య సిబ్బంది

కాలినడకన వెళ్తున్న వైద్య సిబ్బంది

ఒర్రెదాటి.. వైద్యం అందించి

మూడు కిలో మీటర్ల మేర కాలినడకన వెళ్లిన వైద్యులు

నార్నూర్ సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది బాబేరుురి గ్రామ పంచాయతీ పరిధిలోని ధన్నుగూడ ఒర్రెదాటి మూడు కిలోమీటర్ల మేర కాలినడకన వెళ్లి మంగళవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ధన్నుగూడలో రక్త నమూనాలు సేకరించారు. గర్భిణులను పరీక్షించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధుల నివారణ, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తరణ అధికారి రాథోడ్ తులసీదాస్, ఆరోగ్య విస్తరణ అధికారి చౌహాన్ చరణ్‌దాస్, ఎంఎల్‌హెచ్‌పీ హిమబిందు, ఏఎన్‌ఎం మాన్కు బాయి, ఈశ్వరీ, అంగన్‌వాడీ టీచర్ మలు, చంపబాయి, ఆశ కార్యకర్తలు రూపాబాయి, ఎత్మాబాయి పాల్గొన్నారు.

- నార్నూర్, ఆగస్టు 13


న్యూ లోలం వద్ద మిషన్ భగీరథ వాల్ నుంచి పైకి ఎగసి పడుతున్న తాగు నీరు

నింగిలోకి దూసుకెళ్లే రాకెట్ కాదు..

మిషన్ భగీరథ జలం

● పైపుల లీకేజీతో ఉవ్వెత్తున ఎగసిపడుతున్న నీరు
● నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో పాలాల్లోకి వాటర్

మీరు చూస్తున్న చిత్రం.. మబ్బులను తాకుతూ నింగిలోకి దూసుకెళ్తున్న రాకెట్‌లా కనిపిస్తుంది కదూ.. అలా అనుకుంటే పొరపడినట్టే. మరీ పాంటెయిన్ నుంచి పాలబుగ్గల జలధార పైకి వస్తుందనుకుంటున్నారా.. అదీ కాదు.. ఎంటంటే.. కేసీఆర్ సర్కారు ప్రజలకు శుద్ధజలం అందించాలన్న లక్ష్యంతో మిషన్ భగీరథను ప్రవేశపెట్టింది. నేటి కాంగ్రెస్ సర్కారు భగీరథ పథకంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో చాలా చోట్ల పైపులు లీకేజీ అవుతున్నాయి. ఈ చిత్రం నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలోని న్యూలోలం వద్ద పైపులైన్ లీకేజీ కావడంతో మంచినీరు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నది. దీంతో ప్రజలకు మంచినీరు దొరుకక అవస్థలు పడుతున్నారు. దీనికితోడు పాలాల్లోనికి నీరు చేరడంతో పంట నష్ట పోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- దిలావర్‌పూర్, ఆగస్టు 13

అంగన్‌వాడీ కేంద్రంలో అన్నం రుచి చూస్తున్న కలెక్టర్ రాజర్షి షా

కలెక్టర్ విస్తృత తనిఖీలు

ఎదులాపురం, ఆగస్టు 13 : ఆదిలాబాద్ రూరల్ మండలంలో మంగళవారం కలెక్టర్ రాజర్షి షా విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. తంతోలి గ్రామ పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. చిన్నారుల కోసం వండిన అన్నాన్ని రుచి చూశారు. చిన్నారుల బరువు, ఎత్తును సక్రమంగా కొలవాలని అంగన్‌వాడీ టీచర్‌ను ఆదేశించారు. అలాగే సమీపంలోని చౌక ధరల దుకాణాన్ని పరిశీలించారు. అనంతరం ఇందిరా మహిళా శక్తి ద్వారా రుణం తీసుకుని కిరాణం షాప్ నడుపుకుంటూ ఉపాధి పొందుతున్న మహిళ లబ్ధిదారును వ్యాపారం ఎలా నడుస్తుంది వంటి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో ముచ్చటిస్తూ పాఠాలు చదివించారు. పైప్‌లైన్ లీకేజీ అవుతున్నదని, విద్యుత్ తీగలు సరిచేయాలని, అంగన్‌వాడీ భవనం నిర్మించాలని గ్రామస్తులు కోరారు. ఇంటింటి ఫీవర్ సర్వే ఎంతవరకు చేశారని ఏఎన్ఎం, ఆశ వర్కర్లను అడిగి తెలుసుకున్నారు. జ్వరం ఉన్న వారికి రక్త పరీక్షలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి నాగభూషణం, తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.


ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న రిమ్స్ డైరెక్టర్, రిమ్స్ సూపరింటెండెంట్

ఉచితంగా శస్త్ర చికిత్సలు

● రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్
● ఉచిత గుండె పరీక్ష వైద్య శిబిరం

ఎదులాపురం, ఆగస్టు 13 : ప్రతి రెండు, మూడు నెలలకు ఒకసారి రిమ్స్ ఆస్పత్రిలోని డైస్ కేంద్రంలో నిర్వహించే ఉచిత పిల్లల గుండె వైద్య శిబిరాన్ని జిల్లావాసులు సద్వినియోగం చేసుకోవాలని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. మంగళవారం రిమ్స్‌లోని డైస్ కేంద్రంలో హైదరాబాద్ కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో చిన్న పిల్లలకు ఉచిత గుండె పరీక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, రిమ్స్ సూపరింటెండెంట్ అశోక్ కలిసి ప్రారంభించారు. అధిక సంఖ్యలో గుండె సంబంధిత వ్యాధి పిల్లలు వచ్చారు. వీరిని పీడీయాట్రిక్ కార్డియాలజిస్ట్ సుదీప్ వర్మ పరీక్షించారు. టూడీ ఈకో ద్వారా పరీక్షించి పలువురిని హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఈ సందర్భంగా సుదీప్ వర్మ మాట్లాడుతూ.. ప్రతి 1000 మందిలో 8 నుంచి 10 మంది పిల్లలు గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారన్నారు. ఇక్కడ పరీక్షలు చేసిన వారికి హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో ఉచితంగా శాస్త్ర చికిత్సలు చేస్తామన్నారు. జిల్లాలోని పేద వారికి ఉచితంగా గుండె సంబంధిత వ్యాధులకు చికిత్సలు అందించడానికి కలెక్టర్, వైద్య ఆరోగ్య, డైస్ కేంద్రం ద్వారా శిబిరాన్ని నిర్వహించడం సంతోషమన్నారు. రిమ్స్ ఆర్ఎంవో డాక్టర్ చందు, డైస్ కేంద్రం ఇన్‌చార్జి మేనేజర్ డాక్టర్ రాధిక, ఫిజియో వైద్యులు నాగర్జున్, అడియోలజిస్ట్ శ్రీనివాస్, వైద్యులు సన, ఆదిత్య, ప్రవీణ్, ఉమకాంత్, ప్రశాంత్ పాల్గొన్నారు.